నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, బుధవారం 10 జూలై 2024 RANGAREDDY



## ఉపాధ్యాయుడికి ప్రమోషన్
# స్కూల్‌కు తాళం

మర్పల్లి, జూలై 9 : బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు సర్కారు బడులు సక్సెస్‌ఫుల్‌గా కొనసాగాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టగా.. మండలంలోని జంషాదపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు ప్రమోషన్‌లో భాగంగా వేరే బడికి బదిలీ అయ్యాడు. దీంతో గ్రామంలోని స్కూల్ మూతపడింది. ఇక్కడ ఒక్క టీచరే పాఠాలు బోధించేవారు. ఆయన కూడా బదిలీపై వెళ్లడంతో గ్రామంలోని విద్యార్థులు ఘనాపూర్ పాఠశాలకు కొంతమంది.. సంగారెడ్డి జిల్లాలోని దిగ్వాల్ గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలకు మరికొంత మంది విద్యార్థులు వెళ్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జంషాదపూర్‌లోని పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



### టీచరును నియమించాలి..

ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుడిని నియమించి మా ఊరిలోని ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలి. టీచర్ బదిలీపై వెళ్లడంతో స్కూల్ మూతపడింది. విద్యార్థులు ప్రైవేటు బడుల్లో చేరి ఇబ్బందిపడుతున్నారు. నా కుమార్తె ఒకటో తరగతి చదువుతున్నది. టీచర్ లేకపోవడంతో బడికి పంపించడంలేదు. దీంతో ఇంటి వద్దనే ఉంటున్నది.

–సుభాష్, జంషాదపూర్, మర్పల్లి మండలం

### విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందించాలి..



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్ అందించాలి. గత ప్రభు త్వం అమలు చేసిన ఈ పథకం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నది. ప్రభు త్వ బడుల్లో చదివే వారిలో 95శాతం మంది పేదలే ఉంటారు కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్‌ను అందించి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి.

– బచ్చిగళ్ల రమేశ్, తుర్కయాంజాల్

### టీచర్లు లేక విద్యార్థులు నష్టపోతున్నారు..



ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్‌పై వెళ్లడంతో కొన్ని బడుల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. వాటిని ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు నష్టపోతున్నారు. ఎనికేపల్లి యూపీఎస్‌లో టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు కొడంగల్‌కు వెళ్తున్నారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని సర్కారు వెంటనే ఉపాధ్యాయులను నియమించాలి.

– తలారి వెంకట్ ముదిరాజ్, ఎనికేపల్లి, బొంరాస్‌పేట

### బిల్లులు రాక అవస్థలు..



మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, గౌరవ వేతనం రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా గౌరవ వేతనం జనవరి నెల నుంచి పెండింగ్‌లో ఉన్నది. మధ్యాహ్న భోజనం, కోడిగుడ్ల బిల్లులు రాకపోవడంతో అప్పులు తీసుకొచ్చి.. బంగారాన్ని తనఖాపెట్టి విద్యార్థులకు భోజనాన్ని వండివడ్డిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి మా సమస్యలను పరిష్కరించడంతోపాటు పెండింగ్‌లను చెల్లించాలి.

– బుజ్జమ్మ, మధ్యాహ్న భోజన కార్మికురాలు, కడ్తాల్

### బంగారాన్ని కుదువబెట్టి..



తొమ్మిది నెలలుగా గౌరవ వేతనాలు రాక తీవ్ర ఇబ్బందిపడుతున్నాం. అలాగే, గుడ్లు, కూరగాయల బిల్లులు కూడా ఇక రాలేదు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఒంటిపై ఉన్న బంగారాన్ని షాపుల్లో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొచ్చి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండి పెడుతున్నాం. బిల్లులు చెల్లిస్తామని.. ఎలాంటి ఇబ్బం దులు ఉండవని.. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. గద్దెనెక్కిన తర్వాత మమ్మల్ని పట్టించుకోవడం లేదు. పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల బిల్లులు, వేతనాలను త్వరగా చెల్లించాలి.

– స్వప్న, మధ్యాహ్న భోజన కార్మికురాలు (ఇబ్రహీంపట్నంరూరల్)



ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో జిల్లాలో విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్థంగా మారింది. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వ అలసత్వం కారణంగా ఏజెన్సీల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత తొమ్మిది నెలలుగా బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి..ఒంటిపై ఉన్న బంగారాన్ని షాపుల్లో కుదువబెట్టి పెట్టి విద్యార్థులకు భోజనాన్ని వండి వడ్డిస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకుపోయిన బిల్లులు రూ.4 కోట్ల వరకు ఉన్నాయి. అదేవిధంగా ప్రభుత్వ బడుల్లో అమ్మ ఆదర్శ కమిటీలతో చేపడుతున్న పనులు ఇంకా సాగుతున్నాయి. ఇటీవల చేపట్టిన టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతులతో చాలాచోట్ల ఉపాధ్యాయుల కొరత నెలకొన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆశించిన స్థాయిలో బోధన జరుగడం లేదన్న అభిప్రాయం వినిపిస్తున్నది.

- రంగారెడ్డి, జూలై 9 (నమస్తే తెలంగాణ)

# మొక్కుబడిగా..
## ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ

- రంగారెడ్డి జిల్లాలో ఏడు నెలల వ్యవధిలోనే అస్తవ్యస్థం
- అప్పులు చేసి.. ఒంటిపై ఉన్న బంగారాన్ని కుదువపెట్టి..విద్యార్థులకు మిడ్ డే మీల్స్
- పేరుకుపోయిన రూ.4కోట్ల మధ్యాహ్న భోజన బిల్లులు
- నెలల తరబడిగా ఏజెన్సీలకు చెల్లింపులు నిల్
- అటకెక్కిన అల్పాహార పథకం
- నత్తనడకన సాగుతున్న అమ్మ ఆదర్శ కమిటీ పనులు

### మధ్యాహ్న భోజన ఏజెన్సీలు 908..

జిల్లాలో 1,271 పాఠశాలలుండగా..వాటిలో లక్షా యాభైవేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకాన్ని 908 మహిళా ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి. అయితే సకాలంలో బిల్లులు రాక ఏజెన్సీలకు పథకం నిర్వహణ కష్టంగా మారుతున్నది. 9, 10 తరగతుల విద్యార్థులకు సంబంధించిన బిల్లులు గతేడాది డిసెంబర్ నుంచి రూ.1,16,811,360 బకాయిలు పేరుకుపోయాయి. కోడిగుడ్లకు సంబంధించి మరో రూ.1,36,56,928 పెండింగ్ బిల్లు లు గత డిసెంబర్ నుంచి విడుదల కావాల్సి ఉన్నది. వాటి మొత్తం రూ.4 కోట్ల వరకు ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం గతేడాది అట్టహాసంగా ప్రారంభించిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది. కొంతకాలం పాటు ఈ పథకాన్ని ఏజెన్సీలు నిర్వహించగా..అందుకు సంబంధించిన రూ.85,24,512 బకాయిలు అలాగే ఉండిపోయాయి. అప్పులు చేసి పిల్లలకు వండి పెట్టాల్సి వస్తున్నదని ఏజెన్సీల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ బిల్లులు రాక ఏజెన్సీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండగా..ఏజెన్సీల బాధ్యతలను క్రమక్రమంగా అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండడం పట్ల మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు ఏజెన్సీలకు ప్రభుత్వం ఇచ్చే రూ.రెండు వేల గౌరవ వేతనం సైతం ఆగిపోయింది. గతేడాది అక్టోబర్ నుంచే రావడం లేదు. వేతన బకాయిలు సైతం జిల్లావ్యాప్తంగా రూ. 1.60కోట్ల మేర ఉన్నట్లు తెలిసింది. అయితే బడ్జెట్ లేకనే బిల్లులు మంజూరు కావ డం లేదని అధికారవర్గాల నుంచి తెలుస్తున్నది. ఎన్నికల సమయంలో గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని.. పెంచిన వేతనం మాటే మోగానీ..గతంలో కేసీఆర్ ప్రభుత్వం పెంచిన వేతనాన్ని సైతం ఇవ్వడంలేదని ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సా..గుతున్న సదుపాయాల పనులు..

మన ఊరు–మన బడి, పీఎంశ్రీ పథకాల కింద ఎంపిక కాకుండా మిగిలిపోయిన ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో మొత్తం 1,309 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ బడుల్లో చేపట్టాల్సిన పనులను గత విద్యాసంవత్సరం చివరలోనే అధికారులు గుర్తించారు. ప్రధానంగా పాఠశాలల్లో ఐదు రకాల సమస్యలు నెలకొన్నట్లు గుర్తించి ఆయా పనులను చేపట్టేందుకు చర్యలు కూడా తీసుకున్నారు. భవనాలకు మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సమస్యలతోపాటు బాలికలకు మరుగుదొడ్లు లేని చోట కొత్తవి చేపట్టాలని ప్రణాళికను రూపొందించి.. తొలి విడతలో 423 పాఠశాలల్లో పనులను కూడా మొదలు పెట్టారు. అయితే వివిధ కారణాలతో ఆలస్యంగా పనులను ప్రారంభించడంతో నేటికీ సంబంధిత పనులు పూర్తి కాలేదు. ఇప్పటివరకు సగానికిపైగా స్కూళ్లలోనే పనులు పూర్తైనట్లు సమాచారం. మరో 286 పాఠశాలల్లో పనులను చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి ఇటీవలే అనుమతులు వచ్చినట్లు తెలుస్తుండగా..ఈ పనులు కూడా అంతంతమాత్రంగానే జరుగుతున్నట్లు తెలుస్తున్న ది. పాఠశాలలు ప్రారంభం అయ్యేనాటికే అన్ని పనులను పూర్తి చేయాల్సి ఉండగా.. నేటికీ కొనసాగుతుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల లేమిని చూసి విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు.

### ఇబ్బంది పడుతున్నాం..



మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం జీతాలు సరిగ్గా ఇవ్వకపోవడం తో చాలా ఇబ్బంది పడుతున్నాం. గతంలో నెల దాటగానే జీతాలు వచ్చేవి. వచ్చే కొద్ది గౌరవ వేతనంతో కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. అయినా ఆ గౌరవ వేతనం కూడా సమయానికి రాకపోవడంతో అవస్థలు పడుతున్నాం. రేవంత్ ప్రభుత్వం మా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– షబానాబేగం, కౌకుంట్ల జడ్పీహెచ్ఎస్ వంటమనిషి, చేవెళ్ల

### అప్పులు చేసి నిర్వహణ



పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనం రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడిస్తున్నాం. నెలనెలా చెల్లిస్తేనే మధ్యాహ్న భోజన నిర్వహణకు ఇబ్బంది ఉండదు. ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనాన్ని చెల్లించి ఆదుకోవాలి.

– అంజమ్మ, రాయికల్ పాఠశాల, వంట మనిషి, షాద్‌నగర్‌రూరల్



- సీఎంఆర్‌లో తీవ్ర జాప్యం.. గత రెండేండ్లుగా పెండింగ్‌లోనే..
- మిల్లర్ల నుంచి రావాల్సిన బియ్యం 24,285 మెట్రిక్ టన్నుల బియ్యం
- అధికంగా పెండింగ్‌లో ఉన్నది గత వానకాలం, యాసంగి సీఎంఆర్ బియ్యమే..
- బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అక్రమ ఆర్జన
- పౌరసరఫరాల శాఖకు నాసిరకం బియ్యం సరఫరా
- గడువులోగా చెల్లించని మిల్లర్లకు పెనాల్టీ విధింపు
- గడువులోగా సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై 125 శాతం జరిమానా

# మిల్లర్ల ఇష్టారాజ్యం!

వికారాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): జిల్లాలో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యం ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. రైస్ మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కావాలనే ఆలస్యం చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖ ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యంగా ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అక్రమంగా ఆర్జిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైస్‌మిల్లుల నిర్వాహకులు సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి తిరిగి బియ్యం రూపంలో పౌరసరఫరాల శాఖకు నిర్ణీత గడువులోగా ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఒకరిద్దరు మిల్లర్లు మినహా.. మిగిలిన వారంతా బ్లాక్‌లో విక్రయిస్తూ సర్కార్‌కే టోకరా వేస్తున్నారని, ఎలాంటి అనుమానం రాకుండా విడుతల వారీగా పౌరసరఫరాల శాఖకు నాసిరకం బియ్యాన్ని అందిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండడం విడ్డూరమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే రెండేండ్లుగా మిల్లర్ల నుంచి సీఎంఆర్ బియ్యం ఇంకా క్లియర్ కాకపోవడం గమనార్హం.

### పెండింగ్‌లో 24,285 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్...

సీఎంఆర్ రైస్ విషయంలో మిల్లర్లు ఇష్టార్యాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత రెండేండ్లుగా తీసుకున్న ధాన్యానికి సంబంధించి ఇప్పటివరకు పెండింగ్‌లోనే ఉండడం గమనార్హం. 2022–23 వానకాలం నుంచి 2023–24 యాసంగి సీజన్ వరకు మిల్లర్లు తీసుకున్న ధాన్యానికి సంబంధించి 24,285 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ పెండింగ్‌లోనే ఉన్నది. అయితే 2022–23 వానకాలంలో 95,095 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు ఇవ్వగా వారు ఇవ్వాల్సింది 4,889 మెట్రిక్ టన్నులు.. అదేవిధంగా 2023–24 వానకాలంలో 44,251 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు ఇవ్వగా ఇంకా రావాల్సింది 13,099 మెట్రిక్ టన్నులు, 2023–24 యాసంగిలో 13,696 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు ఇవ్వగా ఇంకా 6297 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ మిల్లర్ల నుంచి రావాల్సి ఉన్నది.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం ఇచ్చిన 15 రోజుల్లోగా రైస్ తిరిగివ్వాలని నిబంధనలున్నా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. గోదాంలు ఖాళీలేక ఆలస్యమైందంటూ పౌరసరఫరాల అధికారులు చెబుతుండడంతో ఇదే అదునుగా భావించిన రైస్ మిల్లుల నిర్వాహకులు బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీఎంఆర్ బియ్యం జాప్యంపై గతేడాది మిల్లర్లకు 25 శాతం మేర ప్రభుత్వం జరిమానా విధించినా వారిలో ఎలాంటి చలనం లేకపోవడం గమనార్హం.

### 45 రైస్‌మిల్లులకు జరిమానా..

రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ రైస్‌ను అందించేందుకు గడువు ఇచ్చినా అందించని మిల్లర్లపై ప్రభుత్వం పెనాల్టీ విధించింది. సీఎంఆర్ రైస్ నిర్ణీత గడువులోగా ఇవ్వని 45 రైస్ మిల్లర్లకు లెవీ బియ్యానికి అదనంగా 25 శాతం మేర బియ్యం లేదా డబ్బులు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లావ్యాప్తంగా 45 రైస్ మిల్లర్లకు పెనాల్టీ విధించగా ఇప్పటివరకు 18 రైస్ మిల్లర్లు మాత్రమే 125 శాతం మేర సీఎంఆర్‌ను పూర్తి చేశారు. ఏడుగురు రైస్ మిల్లర్లు చెక్కుల రూపంలో పెనాల్టీని చెల్లించారు. అయితే 25 రైస్‌మిల్లర్లు 125 శాతం మేర పెనాల్టీతో సీఎంఆర్ అందజేయాల్సి ఉన్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కిలోకు 35 రూపాయల చొప్పున రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నది.

### మొయినాబాద్‌లో ముజ్రా పార్టీ

- భగ్నం చేసిన ఎస్‌వోటీ పోలీసులు
- అదుపులో ఆరుగురు యువకులు, నలుగురు యువతులు

# డీజేల హోరు.. అశ్లీల నృత్యాల జోరు..

మొయినాబాద్, జూలై 9 : అర్ధరాత్రి సమయంలో డీజేల హోరు.. యువతులు అర్ధనగ్నంగా నృత్యాలు చేస్తుండగా ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి ముజ్రా పార్టీని భగ్నం చేశారు. ఆరుగురు యువకులు, నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నా రు. మండలంలోని సురంగల్ గ్రామ సమీపంలోని అజీబ్‌నగర్ రెవెన్యూలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని టోలిచౌకి ప్రాంతా నికి చెందిన రెహాన్‌సిద్ధ చౌహాన్ ఆటోడ్రైవర్. అతడి భార్య ఆర్కెస్ట్రా సింగర్‌గా పని చేస్తున్నది. కాగా, రోహన్ టోలిచౌకి ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులతో కలిసి ముజ్రా పార్టీ నిర్వహించేందుకు సురంగల్ సమీపంలోని అజీబ్‌నగర్ రెవెన్యూలో ఉన్న ఆర్ఎస్ ఫామ్‌హౌస్‌ను అద్దెకు తీసుకున్నాడు. ఆర్కెస్ట్రా డ్యాన్సర్లుగా పనిచేసే ఢిల్లీకి చెందిన ఇద్దరు యువతులు, హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరు యువతులను తీసుకుని సోమవారం రాత్రి ఆ ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో డీజేల సౌండ్ అధికంగా పెట్టి అర్ధనగ్నంగా.. అసభ్యంగా నృత్యాలు చేస్తుండగా.. విశ్వసనీయ సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఆ ఫామ్‌హౌస్‌పై దాడి చేసి.. నలుగురు యువతులు, ఆరుగురు యువకులను పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు కార్లు , మ్యూజిక్ సిస్టం, సెల్ ఫోన్లు, రూ.12,160 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షల్లో డ్రగ్స్ తీసుకోలేదని తేలింది. కేసు నమోదు చేసిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



ముజ్రా పార్టీ నిర్వహించిన ఫామ్ హౌస్ ఇదే..



మొయినాబాద్ పోలీసుల అదుపులో ఉన్న యువకులు